
ఇంత క్రితం మీకు మా రాజు గురించి చెప్పానా? లేదు కదూ? అయితే, రాంబాబు గురించీ చెప్పి ఉండను. ఏమంటే, వాళ్ళిద్దరూ అవ్వాయి తువ్వాయి. పరీ షేపీ, బొమ్మా, బొరుసూ, తలుపూ ద్వారబంధం, కప్పూ ప్లేటూ, ఇడ్లీ సాంబారూ, పెసరట్టూ ఉప్మా వగైరా వగైరాల్లా ఎప్పుడూ కలిసి మాత్రమే కనిపించే ఒక ద్వంద్వ సమాసమూ, మిశ్రమ పదార్థమూను.

# ఏం చేస్తాం? ఆళ్ళు మనోళ్ళు!

## పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

ఒకడుంటే రెండోవాడు ఉన్నాడని వేరే చెప్పఖ్ఖర్లేదు. ఒకడి గురించి ప్రస్తావించామా రెండోవాడి ప్రసక్తి తెచ్చామన్న మాటే! ఇద్దర్లో ఏ ఒకణ్ని వదిలీ రెండోవాడి గురించి చెప్పడం అనేది సమగ్రం అయి చావదు. అసంపూర్ణం అయి అఘోరించడమే కాకుండా మహా పాపం ఒహటి వచ్చి నెత్తిన చుట్టుకుంటుంది. సగం సగం కథ చెప్పిన వాడికి మొండి తేలు కుట్టినట్లు.

వీళ్ళిద్దరూ అంత అన్యోన్యమైన జంట అయితే, ఒకరి పోలికలు ఒకరికీ, ఒకరి అలవాట్లు మరియొకరికీ తప్పకుండా ఉండే ఉంటాయి కాబోలు అని మీలో ఎవరేనా అనుకుంటే మాత్రం పూర్తిగా పప్పులో కాలేశారన్నమాటే!




ఏమంటే, ఒహడిది ఉత్తర ధృవం, మరొహడిది దక్షిణ ధృవమూను. విజాతి ధృవాల మధ్య ఆకర్షణ అనే సైన్సు సిద్ధాంతం ప్రకారం వాళ్ళిద్దరూ కలిశారు. రాంబాబు అధమం రోజుకి రెండుసార్లయినా స్నానంచేస్తే, రాజు రెండురోజులకొక మారైనా ఒళ్ళు తడపడు. వాడుత్త కాకి బాపతు. మడత నలగని బట్టలు కట్టుకోవడం రాంబాబు పద్ధతైతే, తొడిగిన బట్టలు వంటిని చిరగాల్సిందే కాని వాటికి వేరే విధంగా విమోచనం ఉండకూడదు అనే సిద్ధాంతం రాజుది. సిగరెట్టు, బీడీ అంటే రాంబాబు వాంతి చేసుకుంటాడు. రాజుకి అవి లేకపోతే క్షణం గడవదు. ప్రతీదీ టైం ప్రకారం ఒక పద్ధతిగా జరగాలి అని రాంబాబు అంటే, "టైమేవిటోయ్ గోంగూర! ఎప్పుడు, ఏది అవసరం అయితే అలాచేసి పడెయ్యడమే" అంటాడు రాజు. అప్పుఇవ్వడం రాంబాబుకి అలవాటు లేకపోవచ్చు. కాని, అది తీసుకోకపోతే, ఇంకా రోజల్లా రాజుకి మతిపోతుంది. ఒకడు పచ్చగా బంగారంలా


బొద్దుగా ఎత్తుగా ఉంటే. రెండోవాడు పీలగా నల్లగా పొట్టిగా ఏడుస్తాడు. ఇంతెందుకు? ఒకణ్ణి తయారు చేశాక భగవంతుడు తమాషాగా సరదా కోసం, సరిగ్గా వ్యతిరేక రూపంలో మరొకణ్ణి సృష్టించాడా అన్నట్టుంటారు ఇద్దరూను.

అయితే ఇద్దరిలోనూ కొన్ని సామాన్య గుణాలు లేకపోలేదు. నిజానికి అదే వాళ్ళిద్దరికీ స్నేహాన్నీ, విడిపోని అనుబంధాన్నీ కల్పించిందేమో-ఏమో-అయితే కావచ్చు.

'మనంతటి వాడు లేడు, మనం చాలా తెలివైన వాళ్ళం' అనే ధీమా ఇద్దరిలోనూ సమపాళ్ళలోనే ఉంది. అంతా మనకి తెలుసులే అనే ఆ అహంకారం పొరకి వెనకాల, నివురుగప్పిన నిప్పులా వేపకాయంత వెట్టీ, ఆవగింజంత అమాయకత్వం ఉంది అన్న సంగతి తక్కిన వాళ్ళకి తెలియవలసిందేకాని భస్తే వాళ్ళకి తెలియదు. ప్రగల్భాలు పలకడంలో ఒకరికొకరు తీసిపోరు. అలాగని ఏదైనా పని చెయ్యవలసివచ్చినప్పుడు మాత్రం దానిని ఎలా ఎగగొట్టడమా అనే ఆలోచనే ఇద్దరికీను. ఖర్మంకాలి ఆ పని కనక వచ్చి నెత్తిమీద పడి, ఇంక చెయ్యక తప్పని పరిస్థితి ఏర్పడితే మాత్రం, వాళ్ళు చేసే హంగామా, చూపే కంగారూ, పడే త్రొక్కిసలాటా చూసి తీరవలసిందే కాని వ్రాయనలవి కాదు.

అవునా? అలాంటి పక్షులతో కలిసి ఒకే ఆఫీసులో పక్క పక్కని పని చెయ్యడం అంటే ఎంత ఇబ్బందో కాస్త ఆలోచించండి. వాళ్ళతో కలిసి తిరిగామా, 'ఒరేయ్! ఇద్దరు కాదురోయ్! వెట్టివాళ్ళు ముగ్గురూ' అంటూ వాళ్ళ నామావళిలో, ఉన్నవాళ్ళు నన్నుకూడా ఎక్కడ చేర్చేస్తారా అని భయం. అలా తిరక్కుండా ఉండామా అంటే, అందుకు వీలులేని పరిస్థితి.

ఎందుకు వీలులేదా? రాంబాబు స్వయానా నా క్లాస్‌మేట్. కలిసి బి.యే. దాకా చదువుకొన్నవాడిని, ఇవాళ కాదంటూ దూర దూరంగా ఉంచడం ఎలా? ఇంక పోతే రాజు! వాడిని అసలు వదలడానికే వీల్లేదు. ఏమంటే, వాడిని తీసుకువచ్చి ఉద్యోగంలో చేర్పించేనాడే "బాబూ మావాడుత్త వెట్టిమేళం, పరధ్యానంపరుకు. కొంచెం కనిపెట్టి చూస్తూండు నాయనా!"






అంటూ వాడి మెడనున్న గొలుసుని నా చేతికిచ్చి వాడి బాధ్యత అంతా నాకు అప్పగించి మరీ చక్కాపోయాడు వాళ్ళనాన్న.

అక్కడికి తప్పించుకోవాలనే చూశాను. "అదేవిటండీ! అతనేం చిన్నవాడా? చితకవాడా? డిగ్రీ తీసుకుని ఉద్యోగంలో చేరబోతున్నవాడికి 'గార్డియన్' ఎందుకండీ, పహిల్వాన్‌కి బాడీగార్డులాగ? అసలు నన్నడిగితే మీరు కూడా ఇంత దూరం రావడం అనవసరం అంటాను. ఉద్యోగంలో చేరేవాడు ఆ మాత్రం స్వతంత్రంగా జేరలేడూ? వెనకాల మీరు ఉండాలా?"అన్నా. కాని ఆయన "కాదు నాయనా- నేనెందుకు చెబుతున్నానో విను" అన్నాడు. అప్పుడు ఆయన అలా ఎందుకు అన్నాడో తరువాత కాని నాకు అర్థం కాలేదు.

ఇలా వీళ్ళిద్దరూ నాకు దఖలుపడ్డారా? సరే.... ఈ బాధ్యత ఎలాగా తప్పదు కదా అని నాకు దగ్గరలోనే ఒక రూమ్ చూసి "ఇందులో ఉండండర్రా" అన్నా వాళ్ళిద్దర్నీ. రోజూ ఆఫీసుకి వెళ్ళేటప్పుడు బళ్ళోకి తీసుకువెళ్ళినట్లు నాతో పిల్చుకు పోవడం, తిరిగి వచ్చేటప్పుడు ఆ రెండు శాల్తీలనీ జాగ్రత్తగా రూమ్ దగ్గర దిగబెట్టడం, ఆఫీసులో అరగంట కోసారి వాళ్ళ సీట్ల దగ్గరికి వెళ్ళి వాళ్ళేం చేస్తున్నారో, ఆఫీసు పని ఎలా వెలగబెడుతున్నారో అజమాయిషీ చెయ్యడం, అవసరం అయితే వాళ్ళ పని కూడా అప్పుడప్పుడు నేను చేసిపెడుతూ ఉండడం, ఆఫీసరు వేసే చివాట్ల నుంచి నా శాయశక్తులా తప్పిస్తూ ఉండడం ఇదో నిత్య విధి అయిపోయింది నాకు.

ఆఫీసులో చేరిన కొత్తలో ఇద్దరూ ఉమ్మడిగానూ, విడివిడిగానూ చేసిన ముచ్చట్లు చెప్పలేనన్ని. సెలవు చీటీ పెట్టకుండా ఆఫీసు ఎగ్గొట్టి నాలుగైదు సార్లు మేటినీలకి చెక్కేశారు. "ఏం దొరలూ! గైర్హాజరు కావడం మహా జోరుగా ఉందే! మెమో లిచ్చుకుంటారేవిటి?" అన్న ఆఫీసరు ఉరుములకి ఇద్దరి కళ్ళ నుంచీ జడివాన! వాళ్ళ 'బేర్'మనే స్థితి చూసి, "సార్! నాదే పొరబాటు- నిన్న వాళ్ళిద్దరూ లీవు పెట్టి ఆ సెలవు చీట్లు నాకిచ్చారు సార్! నేనే తమకి ఇవ్వడం మరిచిపోయాను" అని నేను సంజాయిషీ ఇచ్చుకున్నాను రెండు మూడు సార్లు.

"వచ్చిన ప్రతి రూపాయి మనియార్డరుకీ ఒక అప్లికేషన్ ఫారం చొప్పున పంపించవయ్యా"అంటూ మేనేజరు పురమాయించి వెయ్యి అప్లికేషన్ ఫారమ్‌లు ఇస్తే అయిదు వందల రూపాయలకీ వెయ్యి ఫారాలూ పంపి ఊరుకున్నాడు రాంబాబు ఓ మాటు.

"ఏవిరా నిన్ను తగలెయ్యా ఇలా చేశావు?" అంటే,

"నేను జాగ్రత్తగానే పంపించానురా. ఈ డబ్బులోనో, ఫారాల్లోనో ఏదో మేజిక్కు ఉండి ఉంటుంది. నిజం-నిజంరా- నా మాట నమ్మ- ఒట్టు- సీతోడు" అంటూ నా నెత్తిమీద చెయ్యి పెట్టబోయాడు.

ఏవిటి ఇలా అయిందని ఆరా తీసి తెలుసుకుంటే, తీరా వాడు చేసిన పని ఇదీ-

ప్రతీ వాడూ తనకో ఫారం పంపవలసిందని ఉత్తరం రాస్తూ, దాంతో తను కట్టిన మనియార్డరు బాపతు రసీదు కూడా జతపరుస్తాడు కదా- ఆ రసీదు చూస్తూనే 'ఇంకేం? రసీదు ఉందిగా? రైట్' అంటూ ఓ ఫారంపంపేసేవాడు. మర్నాడు ఆ రసీదు తాలూకు మనియార్డర్ వచ్చేది. 'మనియార్డర్‌కి ఒక ఫారంగా?' అంటూ మళ్ళీ ఇంకో ఫారం పంపేవాడు. ఫలితంగా ఒక్కొక్క అసామీకి రెండు ఫారాలు వెళ్ళాయి. ఇలా ఒక్కొక్క రూపాయికి రెండేసి ఫారాల చొప్పున పంపేసి హమ్మయ్య అని చేతులు దులుపుకొని కూర్చున్నాడు.

చూస్తే వచ్చినవి అయిదు వందల రూపాయలూ, వెళ్ళినవి వెయ్యి ఫారాలూను.

ఈ సంగతి తెలిసి ఆఫీసరు నరసింహావతారం దాల్చి వాడిని చీల్చెయ్యడానికి సిద్ధం అయితే ఆఫీసులో వాళ్ళం అంతా కలిసి వాడిని రక్షించేసరికి తాతలు దిగివచ్చారు.

ఇలాగే ఇంకో మాటు మేనేజరుఅందరికీ అన్ని పనులూ అప్పగిస్తే తనకి అప్పగించిన పని తగలెయ్యడం మొదలెట్టాడు రాజుగాడు. "నాయనా నువ్వేం చెయ్యక్కర్లేదు కాని. టపాలో వచ్చిన కవర్లు చింపి వాటిలోపల ఉన్న కాగితాలుమాత్రం తీసి జాగ్రత్తగా బొత్తి పెట్టు"అంటే, "ఓ- దానికేం?" అంటూ లోపల కాగితాల సమేతంగా కవర్లని చింపేసి మొత్తం 'కరస్పాండెన్స్'అంతనీ చింపి పోగులు పెట్టాడు. ఆ రోజున ఇద్దరం మనుష్యులం చెరో జబ్బా పట్టుకొని ఆపాం కనక కాని, లేకపోతే పిచ్చి కోపంతో వాణ్ణి మేనేజరు చావబాదేసి ఉండును.

అమధ్య ఓ రోజున, టైమ్ అయిపోయిందని రాంబాబు గబగబా ఆఫీసుకి వస్తూంటె, దారిలో చెప్పు తెగిపోయిందట! ఈడ్చుకుంటూ ఎంతసేపు నడుస్తాం అని చెప్పి చెప్పులు చేతబట్టి వచ్చేసి, అలా అమట్టునే సంతకం పెట్టడం కోసం సరాసరి ఆఫీసరుగారి రూమ్‌లోకి వెళ్ళి

పోయాడు. ఒగుర్చుకుంటూ ఎండ వేడికి జేగురించిన మొహంతో, చెప్పు పుచ్చుకుని పెద్దపెద్ద అంగలేసుకుంటూ తనకేసే వస్తూన్న రాంబాబుని చూసి 'ఏం అఘాయిత్యం చేస్తాడోరా దేవుడా' అని కంగారుగా కుర్చీలోంచి లేచారు ఆఫీసరుగారు తత్తరపాటుతో. ఆ తర్వాత స్థిమితంగా అర్థం అయిందట అది ఆయాసమేకాని ఆవేశంకాదనీ. చేతిలోవున్న చెప్పులు స్వార్థం కోసమేకాని, పరార్థం కోసం కాదనీను. అర్థంఅయిన తర్వాత ఆయన ఆఫీసులో అందరికీ చెప్తే, ఆయన నవ్వామేం నవ్వా. ఇంతమంది నవ్వుతూంటే అర్థం అయి చావదే వాడికి. పైగా "మీరు అంతా ఎందుకు నవ్వుతున్నారు?" అని ప్రశ్న ఒకటి.

అవునా?

మొన్నీమధ్య రాజు ఏం చేశాడూ. పనిమాలా మేనేజరు దగ్గిరకు వెళ్ళి అతి సీరియస్‌గా "అదేవిటండీ- ఎప్పుడూ చెప్పారేకాదు- రవీంద్రనాథ ఠాగూరు గారు మీ బంధువులా?" అన్నాడు అందరూ ఉండగా. ఆయనకి మతిపోయి, ఒక్క క్షణం ఆ మట్టునే ఉండిపోయి. ఆ తర్వాత మహ ఇబ్బందిపడిపోతూ "ఏవిటయ్యా నువ్వనేది? ఠాగూరేవిటి నా బంధువేమిటి?" అన్నాడు గట్టిగా.

దాంతో వీడు ఊరుకోవచ్చునా?....

ఊహుఁ!

"దాచకండి సార్!.... నేను చూడలేదు అనుకున్నారా ఏవిటి? నిన్న సాయంత్రం మీ సీటు దగ్గిరికి వచ్చి "ఇవాళ రాత్రి నేను భోజనానికి రానురా, అమ్మాయికి చెప్పు నాకు బియ్యం పొయ్యొద్దని" అంటూ వెళ్ళలేదా ఆ పొడుగు లాల్చీ గెడ్డపాయన? కొంచెం ఆయనకి రికమెండ్ చెయ్యండి సార్- నా పద్యాలున్నాయి సర్ది పెట్టమని" అన్నాడు.

అంతా నోరావలించి వింటూంటే ఆయన కూడా గుర్తుప్పగించి కాస్సేపు చూసి ఆ తర్వాత విరగబడి నవ్వి "ఓయ్ నీ అసాధ్యం గూలా? ఆయనా?....ఆయన మా పింతండ్రోయ్! ఠాగూరూ కాదు ఏం కాదు! ఈమధ్య సన్యసిస్తాను సన్యసిస్తానంటూ గెడ్డం పెంచి లాల్చీ వేశాడు. ఇంకా పాత ప్రియురాండ్రమీదా, కొత్త ఆవకాయ మీదా భ్రమ తీరక తటపటాయిస్తున్నాడు. అప్పుడప్పుడు ఇలా వచ్చి కనిపిస్తూ ఉంటాడు. చాల్లే నీ ఠాగూరూ నువ్వూను" అన్నాడు.

అందరూ ఘొల్లున నవ్వి నాకేసి చూశారు. 'చూశావా మీ మిత్రుడి తెలివి!' అన్నట్టు. చెప్పొద్దూ నాకా క్షణంలో వాణ్ణి చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది. "ఫో....నీ పని చూసుకో-తెలివి తక్కువవాగుడూ నువ్వూను" అన్నా చీదరించుకుంటూ— "ఇప్పుడు నేనేం తప్పు మాట అన్నానని! నన్నెందుకలా విసుక్కుంటావు!" అంటూ గింజుకుంటాడే తప్ప అర్థం చేసుకోడే.

ఆఫీసులో ఇలా అఘోరించే వాళ్ళు పోనీ రూమ్‌లోనైనా సజావుగా ఏడుస్తున్నారా అంటే అదీలేదు. ఒక రోజురాత్రి నేను సెకండ్ షో సినీమా నుంచి తిరిగి వస్తూంటే మూసేసి ఉన్న వాళ్ళ తలుపుకి ఒక చిన్న హరికేన్ లాంతరు తగిలించి ఉంది. ఇదేవిటాఅని దగ్గరికి వెళ్ళి లైటు వత్తి హెచ్చించి చూద్దును గదా, ఓ కాగితం జిగురుతో తలుపుకి పకడ్బందీగా అతికించి ఉంది. దాని మీద పెద్ద పెద్ద అక్షరాలు.

మా రూమ్‌లో విలువైన సామాన్లేమీ లేవు!

అని-

"ఈ రాతేవిటిరా మీ మొహాలు ఈడ్చా?"అని లేపి అడుగుదాం అనుకొని ఈ అర్థరాత్రి వేళ అరాలూ కేకలూఎందుకని మా యింటికి వెళ్ళిపోయి మర్నాడు ప్రొద్దుటే వెళ్ళి అడిగాను.


"అదా?.... అది.... చాలా దూరం ఆలోచించి చేశాంలే!" అన్నారు.

"ఏమిటట ఆ దూరం ఆలోచన?" అన్నా.

"క్రితం రోజు మా ప్రక్క ఇంట్లో ఆ క్రితం రోజు ఆ ప్రక్క ఇంట్లో ఇలా ఒక వరస ప్రకారం దొంగతనం జరుగుతోంది. ఆ లెక్క ప్రకారం చూస్తే నిన్నటి దొంగతనం మా రూమ్‌లో జరగాలి. తీరా దొంగతనం జరగడం ఆ దొంగ మహానుభావుడెవడో తలుపులు బద్దలకొట్టి లోపలికి ప్రవేశించడం, మేం ఇద్దరం ఝడుసుకుని చావడం, ఖరీదైన వస్తువులేం దొరక్కపోయేసరికి ఆగూన గారికి ఆగ్రహం రావడం, మమ్మల్ని ఆ కోపంలో చితకబాదడం ఇదంతా [illegible]దుకొచ్చిందని దూరం ఆలోచించి విలువైన వస్తువులేం మా రూమ్‌లోలేవనే ఆ నాలుగు మాటలూ రాసి తలుపుకి అంటించాం. అంటించడం అయాక ఓ అనుమానం వచ్చింది. మనం రాసింది చీకట్లో వచ్చే ఆ దొంగకి ఎలా కనిపిస్తుంది- ఆయన చీటీ చూడకుండా కార్య రంగంలోకి దిగితే మా ప్రయత్నమంతా వృధాయే గదా- అందుకని చీకట్లో ఆయనకి చీటీ స్పష్టంగా కనిపించగలందులకై హరికేన్ లైటు ఒకటి వెలిగించి ఆ పక్కని ఉంచాం.

అంతే!

మా ప్రయత్నం అమోఘంగా పని




చేసింది. రాత్రి మా రూమ్‌లో దొంగ పడ లేదు తెలుసా?.... హుం!" అంటూ హుషారుగా జమిలి కంఠాలతో డ్యూయెట్ పాడినట్లు గడగడా చెప్పేసి, ఆఖర్న "కానయితే తెల్లారేటప్పటికి ఆ లైటు మాత్రం లేదు. అంతే!" అంటూ నీరసంగా ముక్తాయింపు పలికారు.

"అఘోరించినట్లే ఉంది లెండి మీ తెలివి" అన్నాను, ఇంక ఎలా అనాలో తెలియక.

ఓ ఆదివారం నాడు నేను వాళ్ళ రూమ్‌కి వెళ్ళేసరికి ఇద్దరూ కూచుని పగల బడి నవ్వుకుంటున్నారు. పక్కని చూస్తే పిడతల్లో పెట్టిన రెండు జామ ముక్కలు కనిపించాయి.

"ఏవిటిరా కథ? నవ్వుతున్నారేమిటి" అంటే పాటకచ్చేరీలో పాల్గొంటూన్న జోడు సన్నాయిలలాగ ఒకడు ఒక


మీ చిగుళ్లను దృఢంగా వుంచుకోండి
మీ పళ్లకు దీర్ఘ ఆయుస్సునివ్వండి.



కేవలం ఫోర్‌హెన్స్‌లో మాత్రమే చిగుళ్లను దృఢపర్చగల ఒక ప్రత్యేకమైన అస్ట్రింజంట్ కలదు.


దీని అద్వితీయమైన రుచియే దీని ప్రభావానికి ఋజువు

ఫోర్‌హెన్స్‌లోని అస్ట్రింజంట్ చిగుళ్లకు విశిష్టమైన రక్షణ నిస్తుంది. ఈ అస్ట్రింజంట్ వాపును అరికట్టి బలహీనమైన మరియు మెత్తబడిన చిగుళ్లను సంకోచింపజేసి వాటిని ఆరోగ్యంగా వుంచుతుంది. మీ పళ్లకు దీర్ఘ ఆయుస్సు మరియు దృఢమైన ఆధారాన్ని ఆరోగ్యమైన చిగుళ్లే ఇవ్వగలవు. ఆరోగ్యమైన పళ్లకు కూడా కావాలి దృఢమైన చిగుళ్ల ఆధారం. అందుకే మీకు కావాలి ఫోర్‌హెన్స్...అస్ట్రింజంట్ కలిగిన అద్వితీయమైన టూత్‌పేస్టు.




ఫోర్‌హెన్స్‌ను విశ్వసించండి.
ఇది పళ్ల డాక్టరు సృష్టించిన టూత్‌పేస్టు

288 F 203 TEL




మాటా ఒకడు ఓ మాటా చొప్పున ఇలా చెప్పారు.

"పొద్దున్నే జామి అంట్లు పట్టుకొచ్చాడులే ఒకడు."

"మాకు రేటు తెలియదనుకున్నాడు కాబోలు."

"ఒక్కొక్కటి రెండేసి రూపాయలు చెప్పాడు."

"సరిగా చెప్పు-మాకు రేటు తెలియదనుకోకు."

"మాది కడియపు లంకే అని బొంకాను."

"దాంతో వాడు జంకాడు."

"ఇంతకీ ఎలా ఇస్తావు? ఇచ్చే బేరం చెప్పు అన్నా."

"వాడు చాలాసేపు తంటాలుపడ్డాడు."

"బతిమాలాడు.... మరో మాట అనండి అన్నాడు."

"చివరికి ఎంతకిచ్చాడో తెలుసా?"

"రెండూ కలిసి రూపాయిన్నరకి."

ఇద్దరూ మళ్ళీ పకపకా నవ్వడంమొదలెట్టారు.

నాకు ఆశ్చర్యం వేసింది.

"ఏమో అనుకున్నాను కానీ మీరు మొత్తానికి తెలివైనవాళ్ళేరా!" అన్నా.

'మరేవిటి అనుకున్నావ్!' అన్నట్లు నాకేసి ఓ మారు చూసి ఆ తర్వాత ఒకళ్ళవేపు ఒకళ్ళు తిరిగి మీసం అయితే దువ్వుకోలేదు కాని కాస్త ఇంచుమించు అంత పనీ చేశారు.

"అంత చవగ్గా ఎవడిచ్చాడు రా!" అన్నా ఆశ్చర్యంలోంచి ఇంకా తేరుకోక.

"మరేవిటి అనుకున్నావ్?"

"బేరమా, మజాకా?"

"మళ్ళీ మొదలెట్టకండి జోడు సన్నాయిలూ మీరూను". గట్టిగా ఒక్క అరుపు అరిచా.

గుప్‌చుప్! ఇద్దరూ నోరు మూసేశారు.

"సర్లెండి- ఇంతకీ ఏం చేస్తారు ఈ మొక్కల్ని."

"ఏం చెయ్యడం ఏమిటీ? పిడతలు బద్దలు కొట్టడం, అంట్లు రెండూ నేలలో పాతడం"— ఈ మాత్రం తెలియదా అన్నట్లు నన్ను చూసి నవ్వారు.

"అది తెలుసులేవోయ్! మీకు ఇల్లు ఏదీ? ఉన్నది అద్దె ఇల్లు కదా?"

"అద్దె ఇల్లు అయితే ఏం? మనం ఇవాళ పాతుతాం. పదేళ్ళు పోయాక మనం ఇక్కడ లేకపోయినా, అప్పుడు ఈ ఇంట్లో ఉన్నవాళ్ళు మన పేరు చెప్పుకుని హాయిగా జామపళ్ళు తింటారు. మనం చేసేది ప్రతీది స్వార్థం కోసమే చేస్తామా?"

"పరోపకారార్థం...." అంటూ రాజు వాక్యం పూర్తిచేశాడు.

"సరే కానియ్యండి- అద్దె ఇంటికి అలంకారాలు" అన్నాను నిట్టూరుస్తూ.

వన్, టూ, త్రీ, అని టప్‌మని ఇద్దరూ చెరో పిడతనీ బద్దలుకొట్టారు. కొడితే ఏం ఉంది?

ఆ పిడతలలో ఉన్నవి అంట్లూ కాదు. మొక్కలూ కాదు.

కొమ్మలు! కేవలం రెండు కొమ్మలు!

రెండు పిడతలలోనూ రెండు కొమ్మలూ గుచ్చి పట్టుకొచ్చి ఈ పిచ్చి కొయ్యలకిచ్చి రూపాయిన్నరా ఎగరేసుకుపోయాడు.

వాడెవడో ఘటీకుడు!

"ఒరేయ్ చూశారా! ఇదిరా మీ తెలివి!" అన్నా ఆ కొమ్మలని చూపించి, మట్టి పిడతల్లా విచ్చిపోయిన వాళ్ళ ముఖాలకేసి చూసి పకపకా నవ్వుతూ.

వాళ్ళేనా తక్కువ తిన్నది?

వెంటనే ప్లేటు ఫిరాయించి "పోవోయ్! మాకు తెలియకేం కాదు. ముందే తెలుసు ఇవి కొమ్మలనీ, వీటికి వేళ్ళు లేవనీనూ. అయినా పోనిద్దూ పొద్దున్నే వచ్చాడు పేదవాడు, ఓ రూపాయో, రూపాయన్నరో తింటే ఏం పోయిందని ధర్మం చేశాం. లేకపోతే ఈ అద్దె కొంపని జామమొక్కలతో అలంకరించేటంతటి వెర్రి వాళ్ళం ఏం కాదు" అంటూ దబాయించారు.

అలాంటి సజ్జుకి హంపీ గురించి చెప్పడం ఎందుకు, బతిమాలితే మాత్రం కమలాపురం నాతో తీసుకువెళతానులెండి అని ఒప్పుకోవడం ఎందుకు? బుద్ధిగడ్డితిని అన్నాను. "కమలాపురంలో మాఅన్నయ్య ఇంజనీరుగా వుంటున్నాడు. ఈ సంక్రాంతి సెలవులు మూడురోజులూ అక్కడికి వెళుతున్నాను. అక్కడికి హంపీ శిథిలాలు దగ్గిరేకదా చూసి వస్తాను" అనీ.

ఇంక చూసుకోండి. దాంతో పట్టుకున్నారు ఇద్దరూ చెరో వేపూను! "మమ్మల్ని కూడా తీసుకువెళ్ళరా! మాకా హంపీ శిథిలాలు నువ్వు తప్పిస్తే ఎవరు చూపిస్తారు చెప్పు" అంటూ. "నేటి హంపీ ఒకనాటి కిష్కింధట! జన్మస్థలాన్ని చూసి రావాలని మీకు కోరిక కలగడం సహజమే! సరే బయలుదేరండి" అన్నా.

"ప్రయాణంలో కూడా శుభ్రమైన బట్టలు వేసుకోడు. ఈ గోనె గుడ్డలవాడితో నేను రాలేను" అని రాంబాబూ,

"అసలు నువ్వు నాకో యాభై రూపాయలు అప్పిస్తేనే నీ ప్రయాణమైనా, నా ప్రయాణమైనా" అని రాజూ,

"నువ్వు నాలిక పీక్కున్నా నయాపైస ఇచ్చేది లేదు" అని మళ్ళీ రాంబాబూ.

"అయితే కదిలేది లేదు. ప్రయాణం

కేన్సిల్" అని రాజా.

"నీకు టైమ్ సెన్సులేదు- అవతల రైలుకి టైమయింది."

"నువ్వు టైము, గియము అన్నావంటే నాకు చిర్రెత్తుకొస్తుంది. ఏవిట్రా టైము?"


"చూడరా- సిగరెట్టు కాలుస్తూ మీద మీదకి వచ్చి పొగ మొహంమీద ఎలా వదుల్తున్నాడో-"

సంగీత కచేరీలో మృదంగంవాడూ ఘటంవాడూ లాగా, ఒకడికంటే ఒకడు రెచ్చిపోతూంటే, నేను వెంటనే పల్లవి అందుకున్నట్లు "నోరు మూసుకుని కూచుంటారా కూర్చోరా?.... హంపీ చేరు కొనే దాకా నోరు విప్పారంటే మిమ్మల్ని అక్కడ నుంచి అలాగే పంపించేస్తాను. అయినా మీరిద్దరూ ఒక వైపున ఉండకండి. చెరొకరూ నాకు చెరోవైపునా కూర్చోండి" అని గట్టిగా అరిచాను.

దాంతో, మా స్టేషన్ నుంచి రైలు హాస్పెట స్టేషన్ చేరుకొనే దాకా మా ముగ్గురి మధ్యా అక్షరాలా పులీ-మేకా-గడ్డి మోపూ ఆట అయింది. ఇద్దరూ మాట్లాడ్డానికి కూడా భయపడి ఊరుకుని,ఏంకావలసి వచ్చినా సౌంజ్ఞలతో ఉేసరిపెట్టడం ప్రారంభించారేమో ప్రాణానికి హాయిగా ఉంది. దారిలోనే కాదు-కమలాపురం చేరుకున్నాక కూడా నోరు విప్పితే ఒట్టు.మా అన్నయ్య పలకరించినప్పుడూ, మా వదిన అన్నం వడ్డించినప్పుడూ, మా అన్నయ్యగారి పిల్లలు దగ్గిరికి వచ్చినప్పుడూ నోరు మెదపకుండా తక్కువ మాట్లాడుతూ ముభావంగా ఉండడంవల్ల "వీళ్ళెవరో పెద్ద మనుష్యులు కాబోలు" అనుకున్నారు మా వాళ్ళంతా.

ఆ మౌనం మౌనం మళ్ళీ మమ్మల్ని ముగ్గుర్నీ మా అన్నయ్య జీప్‌లో హంపీ శిధిలాల దగ్గిరికి తీసుకెళ్ళే దాకా అలాగే ఉంది. శిధిలాలు చూసేసరికి మూగవాళ్ళకి ఒక్కమారు మాట వచ్చినట్లు "అబ్బ! వీటిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందిరా" అంటూ ఒకడూ, "ఒకనాటి ఆంధ్ర మహాసామ్రాజ్యానికి రాజధాని అయిన ఈ పట్టణానికి ఎటువంటి దీనస్థితి పట్టింది!" అంటూ మరొకడూ అరిచి ముఖాలు దీనంగా పెట్టారు.

వాళ్ళ ఆంధ్రాభిమానం చూసేసరికి మా అన్నయ్యకి ఎక్కడలేని గౌరవం




ఏర్పడినట్టుంది. ఎంతో ఓపికతో ఏను గులశాల, దసరా గుట్ట, రాతి రథం, సప్తస్వరాల మండపం,ఉగ్రనరసింహస్వామి విగ్రహం, హజారా రామస్వామి దేవాలయం అన్నీ ఒక్కొక్కటే చూపిస్తూ ప్రతివాని చరిత్రా సవివరంగా చెప్ప సాగాడు. వాడు చెప్పే గొప్ప సంగతికీ, మామూలు సంగతికీ కూడా సమానంగానే "అబ్బ!" "ఆహా!" "ఓహో!" "ఆ!", "నిజంగా?" అంటూ టెలిగ్రాఫిక్ లేంగ్వేజీలో తమ ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ బట్వాడా చేయసాగారు మా రాజా, రాంబాబూను.

"ఆ రాళ్ళు చూశారా?"

"ఆహా?"

"వాటి మధ్యనుంచే...."

"ఓహో!"

"తుంగభద్రానది ప్రవహిస్తోంది."

"అలాగా?"

ఈ రకంగా కాస్సేపు సాగేసరికి మా అన్నయ్యకి అనుమానం వచ్చింది. తను చెప్పింది వీళ్ళకేమైనా అర్థం అవుతోందా, లేక ఊరికే బుర్ర ఊపుతున్నారా అని. నాకేసి ప్రశ్నార్థకంగా చూశాడు. నేను కంగారుగా ముఖం మరో వైపుకి తిప్పి ఎటో చూడసాగాను.

విరూపాక్ష దేవాలయం ముందున్న విశాలమైన వీధికి వచ్చాం.అక్కడ పువ్వు లమ్ముతున్న ఆడవాళ్ళని చూసేసరికి తన్మయత్వం వచ్చిందేమో ఖర్మ!

"ఇచ్చోటనే కదా! ..." అంటూ ఓ పద్యం అందుకొని వెంటనే నాలిక కరుచుకొని "అన్నట్టు ఇది జాషువాగారి స్మశానంలోదికదూ.కొడాలివారి హంపీక్షేత్రంలో పద్యం ఏమిటి చెప్మా" అంటూ ఆలోచనలో పడ్డాడు రాజా. వాడు చేసిన రాగాలాపన వింటూనే నేను కోపంగా చూశాను పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యకు అని.

కాని అప్పటికే ఓ పిచ్చిపని చెయ్యనే చేశాడు.

"ఈ పువ్వులమ్మే పుష్ప లావికల గురించి కృష్ణదేవరాయలు తన ఆముక్త మాల్యదలో ఏం శృంగారపరంగా చెప్పాడు!" అంటూ,

"వెలది ఈ నీ దండ వెల యెంత?" అంటూ పాడుతూ, పెద్ద పెద్ద అంగలేసుకుంటూ పువ్వులమ్ముతూన్న ఓ అమ్మాయి దగ్గరకి వెళ్ళాడు.

వీడిది ఏ బాపతు పైత్యమో అర్థంకాక ఆ అమ్మాయి తెల్లబోయి చూసింది.

"నాకు తెలియదా? ఇచట పుట్టిన చిన్న పిల్లయినా జాణ! ముగ్ధలాగ అలా తెల్లబోతావేమిటి జాణా!" అన్నాడు.

ఆ అమ్మాయికి 'జాణ' అన్నమాట అర్థం అయినట్టుంది. "ఎవడవురా నువ్వు నన్ను జాణ అంటున్నావు? నా జాణతనం నువ్వేం కనిపెట్టావు?" అంటూ కచ్చా బిగించి ఒంటి కాలిమీద లేచింది.

జనం చుట్టూ చేరారు. రాజా బిక్క మొహం వేశాడు. 'ఇలాంటి వాళ్ళని వేసుకొచ్చావేమిట్రా'అన్నట్లు మా అన్నయ్య నాకేసి చూశాడు. నాకు తల కొట్టేసినట్లయింది. రాబోయే ప్రమాదాన్ని గ్రహించి గబ గబా ఆ అమ్మాయి దగ్గరికి వెళ్ళి, బతిమాలి బామాలి చేతిలో రెండు రూపా

యలుపెట్టి, మావాడికి మతి స్థిమితం లేదని చెప్పి నమ్మించి, ఆ గండం తప్పించే సరికి తాతలు దిగొచ్చారు.

ఇంటికొచ్చి రాత్రి భోజనాలయాక, ఉన్న రెండు మంచాలూ, అతిధులు కదా అని వాళ్ళకి పక్కగదిలో వాల్చి, పక్క వేశాక, ఇవతల హాల్లో నేనూ, మా అన్నయ్యా పిల్లలూ, మా వదినా- అంతా నేలమీద పక్కలు పరుచుకున్నాం. ఆ గదిలో రాజూ, రాంబాబూ నిద్రపోయి ఉంటారు. హాల్లో మేం ఇంకా కబుర్లు చెప్పుకుంటున్నాం.

రాత్రి పదిన్నర దాటి ఉంటుంది.

ఇంతలో ఆ గదిలోంచి రెండు పిల్లులు దెబ్బలాడుకుంటున్న శబ్దం వినిపించింది. "మాయదారి పిల్లులు దెబ్బలాడుకుని, దెబ్బలాడుకుని ఆ పెద్ద మనుష్యులమీద ఎక్కడ ఉరుకుతాయో, నడవరా తరిమేద్దాం" అంటూ మా అన్నయ్య కర్ర పుచ్చుకుని హడావిడిగా ఆ గదిలోకి జొరబడ్డాడు.

ఆ హడావిడికి రాంబాబుకి అయితే మెళుకువ రాలేదు కాని "ఏవిటి ఏవిటి" అంటూ రాజు మాత్రం లేచి కూర్చున్నాడు. చూస్తే ఏం ఉంది? అక్కడ పిల్లులూ లేవు, కుక్కలూ లేవూ. రెండు పిల్లుల బుసలూ, హాయిగా నిద్రపోతూన్న స్థూలకాయుడు రాంబాబు ముక్కులోంచీ, నోట్లోంచీ వస్తున్నాయి వివిధ రాగ తాళ గతుల్లో.

రాంబాబు ఇలా బుసలు కొట్టడం, ఇంటి యజమాని అయిన మా అన్నయ్యని కంగారుపెట్టడం, ఇదంతా అవమానంగా అనిపించిందేమో, రాజు ఎంతో నొచ్చుకుని "ఒరేయ్....రాంబాబూ....లే ... ఏవిటది బుద్ధిలేకుండా?....లేమ్మంటూంటే.... ఏదో పెద్ద మనుష్యులం కదా అని మనకి మంచాలూ, పక్కలూవేసి మర్యాదచేస్తే గుర్రు పడతావుట్రా రాస్కెల్!" అంటూ వాణ్ణి తిట్టి తిట్టి లేపి కూర్చోబెట్టాడు.

"పనిమాలా నిద్రలేపి ఈ అర్థరాత్రి వేళ ఉత్తి పుణ్యాన్ని తిడతావేమిట్రా నన్ను?" అంటాడేకాని తను చేసిందేవిటో అర్థం చేసుకోడే రాంబాబు!

ఆ సమయంలో మా అన్నయ్య మొహం చూడ్డానికి నాకు సిగ్గేసింది. ఇంక లాభం లేదు, వీళ్ళ కథఅంతా అర్థం అయ్యేదాకా ఇక్కడ ఉండడంకంటే, పెందరాళే ప్రయాణం కట్టించడం మంచిది అంటూ

అతడు

గతించిన కాలంలో జీవిస్తూ
జరుగుతున్న కాలంలో మరణిస్తూ
రేపటికోసం వాంటెడ్ కాలంతో
పోరాడుతూ



వేయికళ్ళతో ఎదురుచూస్తూ
నిరీక్షిస్తూ చూసే
నిర్భాగ్యుడు నిరుద్యోగి!

—డి. అహల్య

తిరుగు ప్రయాణం గురించి ఆలోచించసాగాను. ఇంకా మా అందరికీ నిద్దర్లు పట్టనేలేదు. మళ్ళీ అవతల గదిలోంచి గలాటా. రాజు కాబోలు వెర్రిగా అరుస్తున్నాడు. "ఏయ్! ఎవరు నువ్వు? ఏమిటా మీదమీదకి రావడం?....ఆ....ఏవిటది?.... కత్తే....? ఆ!" అంటూ.

నేనూ, మా అన్నయ్యా మేం అంతా ఒక్క అంగలో ఆ గదిలోకి ఉరికాం. చూస్తే ఏం ఉంది?

అరుపులు అరిచిన రాజేమో గుండెల మీద చేతులేసుకుని హాయిగా నిద్రపోతున్నాడు. రాంబాబు మాత్రం లేచి కూచుని వాడికేసి నమిలి మింగేసేలా కసిగా చూస్తున్నాడు.

"ఏవిరా, వాణ్ణి ఏం చేశావు?" అన్నా కంగారుగా.

"నేనేం చేశాను? వెధవ పలవరింతలూ వీడూను. పరాయి ఇంటికి వచ్చాం అనే సిగ్గూ, లజ్జా లేకుండా. ఇది వాడి రూమ్ అనుకుంటున్నాడు కాబోలు!" అంటూ నిద్రపోతూన్న రాజుకేసి అసహ్యంగా చూశాడు.

మా అన్నయ్య "బాగానే ఉంది" అంటూ నిట్టూర్చాడు.

మా వదిన కొంగు నోటికి అడ్డంపెట్టుకుని నవ్వుతుంది,

నాకు-చెప్పొద్దూ పిచ్చికోపం వచ్చేసింది. ఒకడు గుర్రుపట్టాడు, ఒకడు పలవరించాడు, సరే ఏదో అఘోరించారు. అది సరే- ఒకరిమీద ఒకడు ఈ వెర్రి కామెంట్స్ ఏమటి? క్రీడావ్యాఖ్యాత పుస్తక సమీక్ష చేసినట్టు? ఇంక లాభంలేదు. వీళ్ళతో ఎంత చప్పున తిరుగు టపా కట్టేస్తే అంత మంచిది.

"మీ స్నేహితులు భలే వాళ్ళురా! వాళ్ళయితే సహం రాత్రిని ఒహాళ్ళు సహం రాత్రిని ఒహాళ్ళు చక్కగా పంచుకొని హాయిగా నిద్రపోయారు. మనకి మాత్రం శివరాత్రిని చేసి వదిలారు" అన్న మా అన్నయ్యతో నా తిరుగులేని తిరుగు ప్రయాణం గురించి చెప్పాను.

అన్నయ్యా, వదినా, పిల్లలూ, తెల్లారితే సంక్రాంతి. ఇవాళ ప్రయాణం ఏమిటి, ఇంకో రెండ్రోజులుండి వెళ్ళమన్నారు.

"అవున్రా పాపం- పండగ పూటా ప్రయాణం అయితే మీ వాళ్ళు ఏమనుకుంటార్రా" అని రాజూ,

"రెండు మూడు రోజులు ఉందాం అని వచ్చాంకదరా" అని రాంబాబూ; అర్థం చేసుకోకుండా వాగడం మొదలెట్టారు. వాళ్ళ అంగుళ్ళు నొక్కి హాస్పేట బయలుదేరేటప్పటికి బ్రహ్మ ప్రళయం అయింది.

మమ్మల్ని దిగబెట్టడానికి హాస్పేట దాకా మా అన్నయ్యా వచ్చాడు మాతో పాటు. మేం హాస్పేట స్టేషన్‌కి చేరుకొనే సరికి, ప్లాట్‌ఫారమ్ మీదికి రైలు వచ్చేసింది. ఇంక రాజూ, రాంబాబుల రన్నింగ్ రేస్ చూసి తీరాలి. ఒకడు బుకింగ్ వేపూ, మరోడు సామాన్లన్నీ చేతిలోనూ, చంక కిందా, నెత్తిమీదా పెట్టుకొని ప్లాట్‌ఫారమ్ మీదకి ఒకటే పరుగు, వెనకనుంచి తొందరలేదని ఎంత అరుస్తున్నా వినిపించుకోరే! గేట్ దగ్గర ఆపుచేసిన టికెట్ కలెక్టర్‌ని చూసే సరికి వళ్ళు మండుకొచ్చింది కాబోలు, ఆ కోపం అంతా రాజు మీద చూపించాడు రాంబాబు "ఏరా ఇంకా టిక్కెట్లు తేవేం?" అంటూ.

వాడు రెట్టింపు కోపంతో "పర్స్ నీ జేబులో పెట్టుకుంటే నేనెలా తెచ్చేది టిక్కెట్లు?" అంటూ అరిచాడు. "ఓ.... ఐ.సీ," అంటూ వెంటనే బరువైన పెట్టెలు రెండూ టిక్కెట్టు కలెక్టర్ రెండు పాదాల మీదా దింపాడు రాంబాబు, జేబులోంచి పర్స్ తియ్యడం కోసం.

టిక్కెట్టు కలెక్టర్ ఒక్క అరుపు అరిచాడు. రాజూ, రాంబాబూ అరుపులకే స్టేషన్‌లో జనం అంతా అటు చూశారు. టిక్కెట్ కలెక్టర్ కేకతో అంతా అక్కడికి

పోగయ్యారు." "ఏం చేశావయ్యా టికెట్ కలెక్టర్నీ?" అని అంతా రాంబాబుని నిలదియ్యడం- "నాకేం తెలియదు బాబోయ్!" అని వాడు బేర్‌మనడం. టికెట్ కలెక్టర్ బాధతో నోరురాక తన పాదాలకేసి సౌంజ్ఞచేసి చూపించడం-అంతా గోలగోల అయిపోయింది. పరిస్థితి సరిచేసే సరికి పది నిముషాలు పట్టింది.

"తొందరేం లేదయ్యా మహానుభావా" అంటున్నా. మా అన్నయ్య మాట విని పించుకోకుండా ఎందుకేనా మంచిదంటూ కంగారుగా రైలుదగ్గిరికి పరిగెట్టి పెట్టెలూ, బేగ్‌లూ అన్నీ రైల్లో పెట్టేసి హమ్మయ్య అని ఊపిరిపీల్చుకున్నారుమావాళ్ళు-చాలా సేపు ప్లాట్‌ఫారం మీద జనం వీళ్ళని వింత జంతువుల్లా చూస్తున్నా అదేం పట్టించుకోకుండా.

"రైలు ఇప్పుడప్పుడే వెళ్ళదు. నా మాట నమ్మండి" అని మా అన్నయ్య నచ్చచెప్పాక కాని, వాళ్ళకి నమ్మకం కుదిరి మాతో టీ స్టాల్‌కి బయలుదేర లేదు. "రైలులో బేగ్‌లూ, పెట్టెలూకూడా పెట్టాం ఖర్మ- రైలుపోతే?" అంటూ సణుగుతూనే ఉన్నారు.

మాతో టీ తాగుతూ ఉన్నా ఓ కంట రైలుని కనిపెడుతూనే ఉన్నారు రాజూ, రాంబాబూను- కాపీ చేసే కుర్రాడిని కని పెట్టే పరీక్షాధికారి లాగ.

ఇంతలో 'కంయ్' మని ఇంజను కూసింది.

"అమ్మ బాబోయ్!" అంటూ ఇద్దరూ పరుగు లంకించుకున్నారు- ఒకడు కప్పుతో సహాను. ఇంకొకడు కప్పు విసిరేసీను.

ఇంక చూస్కోండి పార్స్!

ఆ విసిరేసిన కప్పులోని టీ వెళ్ళి పక్కనుంచే నడుస్తూన్న ఓ పడుచు పిల్ల తెల్లని చీరమీద పడటం, ఆ అమ్మాయి మనవాళ్ళకి నానా ఆశీర్వచనాలూ వడ్డించడం. రెండో వాడి చేతిలో టీకంగారుగా పరిగెట్టడంవల్ల వయ్యారాలు ఒలకబోసిన వాళ్ళిద్దరి బట్టల మీదా కొత్త కొత్త అద్దకాలు ముద్రించింది.

వాళ్ళింకా పరిగెడుతూనే ఉన్నారు.

వెనకనుంచి ఆ పడుచుపిల్ల దీవిస్తూనే ఉంది.

టీ స్టాల్‌దగ్గర్నుంచి తొందరలేదంటూ

## నిర్ణయం

క్రన్నీరై కురవాలని వుంది
కాని ఓదార్చేదెవరు?
పన్నీరై ఉరకాలని వుంది
కాని మెచ్చే దెవరు?



అందుకే —
ఉరుమై ఉరుకుతాను
పిడుగై దుముకుతాను

—మాధవి సనారా

మా అన్నయ్య అరుస్తూనే ఉన్నారు.

ప్లాట్‌ఫారమ్ మీద జనం పోగయి నవ్వుతూనే ఉన్నారు-

అంతా గందరగోళంగా, అయోమయంగా, హడావిడిగా తెలుగు సినీమాలో క్లయిమాక్సు సీనులాగ కలగాపులగంగా అయిపోతోంది.

ఇంతలో దిబ్బుమన్న పెద్ద శబ్దం విని పించింది. చూస్తే ఏం ఉంది?

ప్లాట్‌ఫారమ్ మీద రాజూ, రాంబాబూ అడ్డంగ్గానూ+గుర్తులాగ ఒకళ్ళ మీద ఒకళ్ళు పడి ఉన్నారు.

"అయ్యో.... అయ్యో...." అంటూ జనం అంతా చుట్టూ మూగి "తొందరెందుకయ్యా.... ఇంజను ఒక్కటే షంటింగ్‌కి పోతోంది.... రైలు ఇప్పుడప్పుడే వెళ్ళదు.... అనవసరంగా కాళ్ళు విరగ్గొట్టుకున్నారు, లేవండి." అన్నారు.

ఈ లోగా నేనూ, మా అన్నయ్యా కూడా దగ్గిరికి వెళ్ళాం. చెయ్యి సాయం ఇచ్చి 'లేవండర్రా' అన్నా లేవరే-!

వటపత్ర శాయిలా ఒకడూ, కంచి వరద రాజస్వామిలా మరొకడూ, అ మట్టునే పడుకొని ఉన్నారు ఆ ప్లాట్‌ఫారం మీద.

నా ముఖం మీద కనిపించిన అదుర్దా చూసి కాబోలు "వీళ్ళిద్దరూ మీ వాళ్ళా?" అన్నట్లు చూశారు— అక్కడ మూగిన జనం. వాళ్ళ మాటకేంగాని ఇందాకటి ఆశీర్వచనాల అమ్మాయి— పాతకోపం అంతాపోయి పకపకా నవ్వుతూ నిల బడింది. ప్లస్ గుర్తులావడి ఉన్న మా మిత్రద్వయాన్ని చూసి-

నేను సిగ్గుతో సగం చచ్చి కోపంగా మళ్ళీ "లేవండిరా" అన్నా.

ఉహూఁ!

ఏ మాత్రం కదలకుండా "అసలు వీడే నన్ను పడగొట్టాడు నా కాళ్ళకి అడ్డంపడి" అంటూ రాజుకేసి రాంబాబు పుల్లాపుల్లా చూస్తే.

"అసలు నిన్ను నా పక్కపక్కనే ఎవరు పరిగెత్తమన్నారోయ్!" అంటూ పగిలిపోగా చేతిలో మిగిలిపోయిన టీ కప్పు ముక్కని గాలిలో ఊపుతూ ప్రశ్నించాడు రాజు.

"ఇంతకీ మీరు లేస్తారా, లేవరా?"- ఉరుము ఉరిమినట్లు అరిచాను.

"ఏరా- లేద్దామా, వద్దా?" అని కూడ బలుక్కున్నట్లు ఒకళ్ళకేసి ఒకళ్ళు చూసుకున్నారు.

ఇంకా అలా ప్లస్ గుర్తులా ఎంత సేపు పడుకొని ఉందురో, ప్లాట్‌ఫారమ్ మీద-

నా అదృష్టవశాత్తు గార్డ్ విజిల్ ఊదకపోతే-

రైలు బయలుదేరుతున్నానని కూత కుయ్యకపోతే-

ప్లాట్‌ఫారమ్ మీద జనం అంతా మా పెట్టె దగ్గరకి పోగయి హర్షధ్వానాలతోనూ, నవ్వుల కేరింతాలతోనూ ఏ మహానాయకులకీ చెప్పనంత సందడిగా వీడ్కోలు చెప్పడం, రైలు స్టేషను దాటుతూంటే మా అన్నయ్య దూరంగా ప్లాట్‌ఫారమ్ చివర సన్నగా నవ్వుకోవడం, నాకు అప్పుడప్పుడు చురుక్కుమని జ్ఞాపకం వస్తే భరించలేని అవమానం, కోపం చుట్టుముట్టి, చేసేదేంలేక ఎదురుగుండా ఉన్న బల్లమీద కసిగా గుద్దుతాను గుప్పిళ్ళు మూసి. రాజూ+రాంబాబుతోటి నేను ఈక్వేట్ అయినందుకు— ఏం చేస్తాం? అళ్ళు మనోళ్ళు!

[షరా :- మా రాజూ, రాంబాబూ లాంటి శాల్తీలు మీకే ఆఫీసులోనో, రాజకీయాల్లోనో, తటస్థపడితే అందుకు రచయితబాధ్యుడు కాదు.] ●